కథానిక:

# అక్కఱకు వచ్చిన చుట్టము

★

శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవి

"అన్నగారూ! ఇట్లా ఒక్కసారి వచ్చి వారిని చూసిపోతారూ?" అంటూ సీతమ్మ గడపకు అవతలగా నిలువబడ్డది.

"అట్లాగే వస్తాను" అంటూ చదువుతూఉన్న పత్రికను పక్కకకు పెట్టి ప్రకాశరావు కూర్చున్న చోటినుండి లేచాడు.

అతడికి సీతమ్మను చూడగానే చాలా ఆశ్చర్యము వేసినది. అవతలభాగములో కాపురము ఉంటున్న ఈ ఆరుసంవత్సరాలకాలములో ఇది రెండవసారి యేమో.—ఆమె తన ఎదుటికి వచ్చి మాట్లాడటము! అయినా అతను ఆమెను బాగా పరకాయించి చూడటమూ-ఇంతమాత్రము చనువుగా మాట్లాడటమూ ఇదే మొదటిసారి!

"వారికి నెలరోజులనుండీ జ్వరము వస్తున్నది. కొంచెము దగ్గుకూడా ఉన్నది. చాల బాధపడుతున్నారు. మీరు వెళ్లి పెద్ద డాక్టరును తీసుకొనివచ్చి, వారిని చూపిస్తారేమో అడుగుదామని వచ్చాను. ఈ సహాయము చేసిపెట్టుతారూ?" అన్నది సీతమ్మ తల వంచుకొని.

"మీ యింటికి ఎప్పుడూ వచ్చి, మందు యిచ్చే డాక్టరు ఊళ్ళో లేడా ఏమమ్మా?" అని, ప్రకాశరావు తలుపుమీదఉన్న ఉత్తరీయము తీసి బుజముమీద వేసుకొని కాళ్లకు చెప్పులు తొడుగుకున్నాడు.

"డాక్టరుగారు నెలరోజులనుండీ మందు యిస్తునే ఉన్నారు. ఆ మందుది ఒకదారీ—రోగానిది ఒకదారీగా ఉన్నది. ఏ పెద్దడాక్టరైనా చూసి మందు యిస్తే తగ్గుతుందేమో నన్న ఆశ! నయము కాకపోగా.—అసలు జబ్బు ఏమిటో తెలియకుండా ఉన్నది. విపరీతమైన ఆయాసముతో బాధపడుతున్నారు. ఈ నెలరోజులనుండీ సెలవు పెట్టారు" అంటూ గోడకు చేరబడి నిలవబడ్డది సీతమ్మ.

"అట్లాగే! పెద్దడాక్టరును తీసుకొనివచ్చి చూపిస్తాను. అయితే అంత జబ్బుగా ఉంటే.—ఇన్నాళ్ళనుండీ ఒక్కమాటైనా నాతో చెప్పలేదేమమ్మా?" ఈ మాట అంటూనే ప్రకాశరావు వెళ్ళి అరగంటలో పెద్దడాక్టరును తీసుకొనివచ్చాడు.

డాక్టరు రోగిని పరీక్ష చేస్తూఉండగా, ప్రకాశరావు వంటయింట్లోకి సీతమ్మను పిలిచి "డాక్టరుగారు ఇంటికివచ్చి రోగినిచూస్తే, మామూలుగా పదిహేను రూపాయలు తీసుకుంటారు" అన్నాడు నెమ్మదిగా. సీతమ్మ మారుమాట్లాడకుండా పెట్టెతీసి రూపాయలు లెక్కపెట్టి అతడి చేతిలో పెట్టినది.

అంతలో.—డాక్టరు రోగిని పరీక్ష చేయటమైనది కాబోలు—రోగిని ఒకటి రెండు ప్రశ్నలడిగి, వాకిటితలుపుదగ్గర నిలువబడిన ప్రకాశరావును పిలిచి "నిస్సందేహముగా అదేనండీ! స్పెషలిస్టుకు చూపించి త్వరగా వైద్యము చేయించండి. ఇప్పటికే ఆలస్యమైపోయినది" అని ప్రకాశరావు చేతికిచ్చిన రూపాయలను జేబులో వేసుకొని కారు ఎక్కినాడు. ప్రకాశరావు వెనుకకు తిరిగి గదిలోకి వస్తుండగా సీతమ్మ ఎదురుగావచ్చి 'డాక్టరు ఏమన్నాడు?' అని ప్రశ్నించినది. పాలిపోయిన ఆమె ముఖములో కండ్లు జ్యోతులవలె మెరసినవి.

ఆమె ప్రశ్నకు జవాబు చెప్పబోయి ప్రకాశరావు తడబడినాడు. "అబ్బే!...ఏమీ లేదు! అది ఏం చేస్తుంది?...మంచి మందు వెంటనే యిప్పించినట్లయితే ఈపాటికి తగ్గిపోయేదే! ఇంకొక డాక్టరు—ఇల్లాంటి జబ్బులను త్వరగా నయముచేసే ఆయన ఉన్నాడట—ఆయనను తీసుకొనివచ్చి చూపించమన్నాడు. ఆయనను తీసుకొనిరావటానికి నేను వెళ్లుతున్నానుగాని "సీతమ్మా! నేను తిరిగివచ్చేవరకూ, గాలి బాగా వచ్చేటట్లు కిటికీ తలుపులన్నీ తెరచి

ఉంచు...పిల్లలు తండ్రిదగ్గరికి రాకుండా చూస్తూ ఉండాలి" అంటూ ప్రకాశరావు సైకిలుమీద మరొక డాక్టరుదగ్గరికి వెళ్ళాడు.

అతడు తిరిగి వచ్చేలోపల సీతమ్మ రోగిపక్క చక్కగా దులిపివేసింది. రోగిముఖము తుడిచి—ముడతలు లేకుండా బట్ట కప్పినది. ఆ గది శుభ్రముగా తుడిచి అవసరములేని సామానులన్నీ అక్కడినుంచి తీసివేసినది.

అంతలో ప్రకాశరావు డాక్టరును తీసుకొని వచ్చాడు. డాక్టరు అడిగిన ప్రశ్నలలో చాలావాటికి సీతమ్మ ప్రకాశరావులే జవాబు యిచ్చారు. రోగి మాట్లాడటానికి తగిన శక్తి లేకుండా ఆయాసపడుతున్నాడు.

"వ్యాధి చాలా ముదిరిపోయినది. శానిటోరియమ్‌లో చేర్పించి...ఆపరేషన్ చేయించి చూడండి" అన్నాడు, తడిచేతులను తుడుచుకుంటూ—డాక్టరు.

"శానిటోరియమ్‌లో సామాన్యముగా స్థలము దొరుకుతుందా? మీవంటి డాక్టర్లు వ్రాసియిస్తే త్వరగా దొరుకుతుందేమో!" అని ప్రకాశరావు అంటూ ఆయనచేతిలో పదిహేను రూపాయలు పెట్టాడు.

"చాలా అర్జంటుకేసని నేను వ్రాసియిస్తాను...పోనీ...నేనే అక్కడికి వ్రాసి స్థలము దొరికేటట్లు చూస్తాను. అక్కడినుండి జవాబు రావటానికి వారము రోజులవుతుంది. ఈలోపల రెండు ఇంజక్షనులు ఇచ్చి చూద్దాము." అని మందును సూదిద్వారా చేతికి ఎక్కించినాడు డాక్టరు.

రోగి సన్నగా దగ్గుతూఉండగా—డాక్టరును సాగనంపి ప్రకాశరావు లోపలికి వచ్చి రోగి మంచము దగ్గర నిలువబడిపోయినాడు. కండలు తేరి, రక్తమాంసములతో జవజవలాడుతూఉండిన వెంకట్రావు దేహము ఒక నెలదినములలోనే ఎముకలగూడై ఎండిన వరుగువలె మారిపోయినది. కండ్లూ చెంపలూ లోతుకుపోయి చూడటానికి ఎంత భయంకరంగా మారిపోయినది, అతడి ముఖము! ప్రకాశరావు ఒక వేడి నిట్టూర్పు విడిచి 'సీతమ్మా!' అని తడి ఆరిపోయిన గొంతుతో పిలిచినాడు.

సీతమ్మ బియ్యము కడిగి పొయ్యిమీద పెట్టి చేతులను తుడుచుకుంటూ అతడికి ఎదురుగా వచ్చి "డాక్టరుగారు మళ్ళీ ఎప్పుడు ఇంజక్షను యిస్తారు?" అన్నది.

"రేపు సాయంకాలము ఆయనే వచ్చి ఇస్తానన్నాడు...గాని...సీతమ్మా! ఈ జబ్బు ధనవంతులకు రాతగినదిగాని సామాన్యులకు రాతగ్గది కాదు. ఒక గంటసేపటిలో నలభైరూపాయలు ఖర్చు అయినవి. చూశావా? ఇంజక్షనుకు పదిరూపాయలు తీసుకొన్నాడు. ఇంకా ఇటువంటి నలభైలు ఎన్ని కావలసి ఉన్నవో? శానిటోరియమ్‌లో ఉంచటమంటే మాటలతో కాదు. ఇంత సొమ్ము జతపరచగలవా? ఒక ప్రక్క రోగిని చూసుకుంటూ—మరొక ప్రక్క పైకము జతపరచాలి." అని ప్రకాశరావు ఆఖరుమాట పూర్తిచేయకముందే సీతమ్మకు కళ్ళల్లో నీళ్లు తిరిగి కంఠధ్వని అప్పటికప్పుడే మారిపోయినది.

"కళ్లనీళ్లు పెట్టుకోకమ్మా. ఇంట్లో మరో దిక్కు లేదని ఆమాట ఎత్తాను. మీ కిద్దరికీ తెలియదని చెప్పాను. తప్పుగా ఎంచుకోకు?" అన్నాడు ప్రకాశరావు.

ఆ మాటకు దుఃఖము పొంగిపొరలిపోయింది సీతమ్మకు. "అన్నగారూ! వారి జీతము మీరు ఎరుగనిదా? ఆ యిద్దరుపిల్లలను పెట్టుకొని—మేము ఎట్లా కాలము గడుపుతున్నామో భగవంతుడికే తెలుసు. తింటున్నామో—తినటము లేదో...ఈ మాత్రముగా బ్రతుకనీయకూడదా దేవుడు?" అని చెంగు కళ్లకు అద్దుకున్నది సీతమ్మ.

"ఆశ్చర్యపడకమ్మా. అన్నీ మన మనుకున్నట్లే జరుగుతాయా? అట్లా జరిగితే ప్రపంచ మనిపించుకుంటుందా? చూడు సీతమ్మా! ఏ మాటయినా దాచిన దానికంటె నీకు చెప్పటమే మంచిది. వెంకట్రావుగారికి బాగా ముదిరిన క్షయవ్యాధి అని డాక్టరు అంటున్నాడు. పిల్లలను తండ్రిదగ్గరికి వెళ్లనీయకు. ఆపరేషను చేయించితే చాలా కేసులు నయమైనాయట." అని ప్రకాశరావు మందగించిన స్వరముతో అంటూ దొడ్డివైపు చూడసాగాడు.

"అమ్మయ్యో! క్షయే! అది నయమవుతుందంటారా?" సీతమ్మకు ఒళ్లంతా చెమటలు పట్టి వణికిపోయినది.

"భయపడకమ్మా. దానికేమిటి...అదే తగ్గిపోతుంది. అసలు ఇంజక్షనులకే చాలా కేసులు నయమై

పోతాయట. నీవు జబ్బువిషయములో దిగులు పెట్టుకోవద్దు. సరే గాని...ఇంట్లో చాలా ఇబ్బందిగా గడుస్తున్నదని అన్నావుకదా! డాక్టరుకోసము వెంటనే పెట్టె తెరిచి రూపాయలు ఎట్లా తీసియిచ్చావు? నే నిట్లు అడిగినానని మరోవిధముగా భావించుకోకుసుమా! నేను నీవు నా చెల్లెలి వనుకొని అడుగుతున్నాను... నీ సంగతే నాకు చాలా ఆలోచనగా ఉన్నదమ్మా." అని సీతమ్మముఖమువంక చూశాడు. సీతమ్మ కళ్లలో నుండి అశ్రువులు చెంపలమీదుగా జాలువారి, బొట్లు బొట్లుగా నేలమీద పడటము అతడికి స్పష్టముగా కనబడ్డది.

"సీతమ్మా! పెద్దవాడువచ్చి నీవెనుక నిలబడ్డాడు చూశావా? చిన్నవాడినికూడా పిలిచి ఇద్దరికీ అన్నము పెట్టు......వెంకట్రావుగారి ఒంటి సంగతి వాళ్ళ చెవిన పడనియ్యకుసుమా. పసివాళ్లు దిగులుపడతారు. ఏదయినా అవసరము వస్తే అబ్బాయిని పంపించు" అని ప్రకాశరావు తన భాగములోకి వెళ్ళిపోయినాడు.

* * * *

వెంకట్రావు మునిపల్లె కామమ్మగారి పెద్ద కొడుకు. అతడు ఇంటరు చదువుతూఉండగా తండ్రి చనిపోవటమువలన ఇంటికి పెద్దఅయి—తల్లితోకూడా ఐదుగురిని పోషించేభారము వహించవలసినవాడైనాడు. గత్యంతరము లేక—ఆనాడు బడిపంతులుగా ప్రవేశించినాడు. జీవనోపాధికి ఏదైనాసరేనన్నట్లుగా ఉన్న ఆనాటి పరిస్థితికి అది ఘనముగానే తోచినది. ఆ కొద్దిజీతములోనే తనవెనుక పుట్టిన తమ్ములిద్దరికీ అతడు చదువు చెప్పించవలసివచ్చినది. ఇద్దరు చెల్లెళ్ళకు కొద్దిపాటి కట్నకానుకలతో పెళ్ళిళ్ళు చేయవలసివచ్చినది. కామమ్మగారి అల్లుళ్ళు యిద్దరూ ఎప్పుడు వచ్చినా కొత్తబట్టలుకట్టుకొని రైలుఖర్చులు చేతిలో పోయించుకొని ఇల్లు కదిలేవారు.

కామమ్మగారికి పెనిమిటిహయాములో పెదవి మెదపే అవకాశము లేకపోయినది. భర్తఆజ్ఞలు ఆమెకు సుగ్రీవాజ్ఞలుగా వినిపించేవి. ఆయన బ్రతికి ఉండగా అణిగిమణిగి నడచిన కామమ్మగారు మబ్బు విడచిన ఎండవలె విజృంభించినది. తండ్రి లేడన్న లోపము ఒకటేగాని ఉన్నదానికంటె ఘనముగా కూతుళ్ళకూ కొడుకులకూ యథావిధిగా శుభకార్యములను జరిపించుకొన్నది. ఆమెమనసు ఎప్పుడూ ఎడతెగని శుభకార్యపు పథకాలతో ఉవ్విళ్లూరుతూ ఉండేది.

కామమ్మగారి హృదయములో మాటుమణగిన బంధుప్రేమను ఆమె పెనిమిటిపోయినతరువాత ఆమె బంధువులు ఇట్టే గ్రహించారు.

"మన కామమ్మ పెద్దకొడుకు ఆ ఊళ్ళోనే ఉన్నాడుగా. వాళ్ల యింట్లోనే దిగుదాము. ఇంకెక్కడైనా దిగితే కామమ్మకు కోపము వస్తుందికూడాను. అనవసరముగా యింకొకచోట దిగి ఆమెమనసు నొప్పించట మెందుకు?" అనుకుంటూ బంధువులు వచ్చి నెలలపర్యంతమూ ఉంటూఉండేవారు. వ్యవహారాలకనీ—వైద్యాలకనీ ఎప్పుడూ ఎవరో ఒకరు ఉంటూఉండేవారు. బంధువులచేత పరిచయము చేయించుకొని కొంతమంది వస్తూఉండేవారు. కామమ్మగారిది పెద్దచెయ్యి. వేళకు నాలుగూ అమర్చి భోజనము పెట్టుతూ 'నీకేమమ్మా అదృష్టవంతురాలవు. చెప్పినట్లు వినే కొడుకు—చక్కగా సంపాదించిపెట్టుతున్నాడు. నీవైనా దొడ్డమనసు కలదానవుగాని అందరివంటిదానవు కాదు' ఒక్కొక్కరు పొగడుతూఉంటే ఆమెకు అరచేతిలో స్వర్గమున్నట్లే ఉండేది.

కామమ్మగారి కొడుకు లిద్దరూ వాళ్లకు కావలసినవి అడగటముతప్ప మరొక విషయము ఎరుగనే ఎరుగరు. పెదవిజారకముందే చదువుకొనటానికి పుస్తకాలు—వేసుకొనటానికి బట్టలూ--చిరుతిండికి చిల్లర డబ్బులూ వాళ్లకు అమరవలసినదే. ఒకరోజు ఆలస్యమైనా కామమ్మగారు వాళ్లపక్షమున వెంకట్రావుమీద యుద్ధము ప్రకటించేది. "ఆ మహారాజు బ్రతికిఉండగా నీ పెండ్లీ చదువూ వైభవముగా జరిగిపోయినవి. నీవు ఎంత మూతివిరచినా బిడ్డలను పెట్టుకొని నీ పంచన పడిఉండక నాకు తప్పలేదు."అంటూ వీధినబడి ప్రకటించేది. పొరుగింటి జగడము వినటానికెంతో వేడుకగా ఉంటుంది. అందరూ చెప్పినదంతా విని 'పాపము పెద్దతనానికి ఎంతకష్టము వచ్చిందో?' ననుకునేవారు.

వెంకట్రావుమెదడు కుటుంబభారము పైనబడిన తరువాత నిర్వికారముగా మారిపోజొచ్చినది. అతడి మనసులో ఎన్నడో ఒకనాడు ఇంటిపరిస్థితులు మెరపులవలె మెరసేవి. మెరసినప్పుడుమాత్రము ఆధా

యమును వ్యయముతో సరితూచటానికి ప్రయత్నించచదలిచేవాడు. తల్లితో తన పరిస్థితులను విప్పిచెప్పవలెనని వాంఛించేవాడు. ఈ ఆలోచనల కొక స్వరూపమేర్పడకముందే తల్లి మేఘగర్జనలు వినపడేవి— ఈ ఆలోచనలు మెరపువలె మెరవటమువరకే అతడి జీవితములో నిలిచిపోతూ ఉండేవి. ఆ అనుభవంవల్లనే అతడికి కొన్ని లోకసత్యాలు గ్రహింపుకు వచ్చినవి. 'తాము ఇతరులకొరకు స్వార్థమును చంపుకొని ఎంత కష్టించినా—తమ దంపతుల కష్టసుఖాలు ఎవరికీ పట్టవు! ఆ యింటిలో ఉన్నవారికీ—వచ్చే బంధువులకూ కేవలము అవసరములను గడపే యంత్రాలు ఆ దంపతులు!'

ఆ దంపతు లిద్దరూ తమను అక్షరాలా యంత్రాలుగా భావించుకున్నారు. కాకపోతే బాకులవలె ఎదలలోనుండి దూసుకొనిపోయే మాటలు పడుతూ కూడా గాలించకుండా వాళ్ల ధర్మాలను వాళ్లు నిర్వహించగలరా? ఇంతో— అంతో సంపాదించుతున్న వెంకట్రావు భోజనములో రుచినీ—శుభ్రమైన బట్టలనూ జీవితములో ఎరుగనివాడిగానే ఉండగలడా? అతడి జీవితములో క్రొత్తకాపురపు ముచ్చటలుగాని ఆనందరసానుభూతిగాని ఎరుగని విషయాలుగా నిలచిపోగలవా? తమకు కావలసినవి నిష్ఠురముతోనూ— ఒత్తిడితోనూ జరిపించుకుంటూఉండేవారిమీద ఏ భావమూ లేకుండా నిర్లిప్తుడుగా ఉండగలడా?

తమ్ముళ్లూ చెల్లెళ్లూ ఒక యింటివారయేసరికి వెంకట్రావు నడివయసులోకి వచ్చినాడు. సంసారశకటము కుంటుతూ గతుకులబాటమీద మందముగా నడచిపోతున్నది.

వెంకట్రావు తమ్ములిద్దరూ ఆరునెలల వ్యత్యాసముగా ఉద్యోగములలో చేరి, చెరి ఒక ఊరిలోనూ కాపురములు పెట్టినారు. క్రొత్త కోడళ్లకూ కొడుకులకూ క్రొత్తకాపురము లమర్చిపోయిన కామమ్మగారు నంజువ్యాధితో—ఇతరులు గుర్తుపట్టలేని రూపముతో వెంకట్రావుయింటికి నాలుగు నెలలకే తిరిగివచ్చినది. ఆ వ్యాధి ఆమెను సంవత్సరముపాటు క్రిందుమీదులు చేసినది. ఆ రోజులలో వెంకట్రావు ఇంటిలో జనసందడి తీర్థప్రజను మరపించినది. ఆమె వైద్యమునకూ బంధువుల రాకపోకలకూ వెంకట్రావుకు అతడి శక్తికి మించిన వ్యయమైనది. కామమ్మగారి కొడుకులూ కూతుళ్లూ వచ్చి చూసిపోతున్నారు.

ఏడాదికిమీదుగా వైద్యము జరిగినది—కాని కామమ్మగారి దేహము మాత్రము వ్యాధి తగ్గి ఆరోగ్యమును పొందలేదు. వెంకట్రావు శారీరకకష్టమూ—ధనవ్యయమూ గమనించకుండా—అతడికి మాట దక్కకుండా కామమ్మగారు భౌతిక దేహము వీడి వెళ్లిపోయినది.

బంధుకోటిలో కామమ్మగారు చాల పలుకుబడిగలదికనుక కర్మలు చేసేనాటికి అందరూ వచ్చినారు. చనిపోయినదన్న వార్త తెలియగానే వెంకట్రావు చెల్లెళ్లూ తమ్ముళ్లూ వచ్చినారు. కర్మలు యథావిధిగా జరిపించినారు.

కామమ్మగారు చనిపోయిన పదమూడవదిన మది. బంధువులందరూ ఎక్కడివారక్కడికి చేరుకొనే ప్రయత్నములో ఉన్నారు.

"కామమ్మ పోయినదంటే నమ్మలేకుండా ఉన్నాను. ఇంకా ఆమె లోపటనుంచి మనలను పిలుస్తూ వస్తున్నట్లే నా కళ్లకు కనిపిస్తున్నది. ఎంత ఆదరణా—ఎంత మర్యాదా! అటువంటి మనిషి ఇదివరలో ఎక్కడైనా పుట్టినదంటావా?" అని కామమ్మగారి మేనమామ బావమరది తన తోడల్లుడితో అంటున్నాడు.

"ఆమె ఆదరించి అన్నము పెట్టటములో సాక్షాత్ అన్నపూర్ణాదేవే అనుకోవాలి. ఈ ఊళ్లో మరెక్కడ దిగినా ఊరుకునేదికాదు. ఎవరు వచ్చినా తన యింట్లో దిగవలసినదే. మహా యిల్లాలు! ఆమెకు ఏమంత పెద్దవయసు ఉన్నదనీ కాలముచేయటానికి? ఆమెకంటె పెద్దవాళ్లు భూమిమీద లేరూ?" అన్నాడు ఆయన.

"పాపము! మహా బాధపడ్డది. రోగానికి తగిన వైద్యము జరిగినదో లేదో? పట్నములాంటి ఊళ్లకు తీసుకొనివెళ్లి మంచి మందు యిప్పిస్తే నాలుగుకాలాలపాటు బ్రతికిఉండేదేమో!" అని తన నమ్మకాన్ని తెలియబరచినాడు కామమ్మగారి చెల్లెలిమరది.

ఎప్పటినుండో ఎదురుచూస్తున్న వెంకట్రావు తమ్ముడికి ఈ మాటలవల్ల - తన మనసులో ఉన్నదంతా వెడల్రగక్కే అవకాశము చేతి కందిచ్చినట్లయినది

"ఆఁ... పెద్దవాళ్లు పోవటమే మంచిది. ఇంకా బ్రతికినకొద్దీ తిండికికూడా యిబ్బంది పడతారు" అన్నాడు తెలివిగా.

"ఆమె కేమి కర్మము వచ్చిందనీ తిండికి ఇబ్బంది పడటానికి?" అని అందరు ఒక్కసారే వెంకట్రావు తమ్ముడివైపుకు తిరిగారు.

"ఆఁ...ఏమీ లేదు. ఆమెకు తిండి పెట్టటమే ఆయనగారికి కష్ట మనిపిస్తుంటే—మంచి వైద్యము చేయించలేదని అంటారేం?" అన్నాడు వెంకట్రావు తమ్ముడు.

బంధువులందరూ ఒకరి ముఖము ఒకరు చూసుకొంటూ విమర్శనలకు ప్రారంభించారు.

ఈ సందర్భములోకూడా వెంకట్రావు తాను యంత్రమన్నమాట మరువలేదు. విషయ మెరుగని విమర్శనలకు అతడు తలమాత్రము వంచినాడు.

ఆతరువాత తరువాత అతడు నెమ్మదినెమ్మదిగా తనుకూడా ఒక మనిషే నన్నభావము కలిగించుకొని తన సంసారపు స్థితిగతులను సమీక్షించుకొనగా—అయిదారువేల ఋణము తేలినది.

తల్లిపోయిన తరువాత తమ్ములుగానీ చెల్లెళ్ళుగానీ తిరిగి చూడలేదు. అతడి క్షేమం తెలిసికోలేదు.

సంవత్సరము గిర్రున తిరిగివచ్చినది. తల్లి సాంవత్సరీకములకు తమ్ములూ చెల్లెళ్ళూ తిరిగి సమావేశమయినారు. వెంకట్రావు తన సంసారపు విషయాలను సమగ్రంగా వాళ్ళతో చెప్పి—అతి సున్నితముగా ఋణముల ప్రశంసను ఎత్తినాడు.

"నాలుగేళ్లు దగ్గర పెట్టుకొని చదువు చెప్పించావే అనుకో! అంతమాత్రాన అప్పులయినవని చెప్పటానికి నోరెట్లా వచ్చినదంట నీకు?" అన్నాడొక తమ్ముడు.

"మాకు ఆస్తి ఏమీ యివ్వకపోగా అప్పు యివ్వవలెనని తోచిందా? మాకు ఆస్తిలో భాగము వద్దులే అన్నయ్యా!" అన్నాడు మరొక తమ్ముడు.

తమ్ములిద్దరూ సూచించిన పిత్రార్జితపు ఆస్తి అంతా పల్లెటూరిలోఉన్న మొండిగోడల మట్టియిల్లు. అది తండ్రినాటి బాకీలక్రింద—ఆ ఊరి కోమటి ఏనాడో లెక్క చూచుకొన్నాడు.

వెంకట్రావు చెల్లెళ్లూ తమ్ములూ ఊరికి వెళ్లేనాడు తిరిగి ఆ ప్రశంస ఎట్లాగో తల ఎత్తినది.

తల్లి మెడలోని గొలును చెరివొకపేటా—చేతిగాజులలో చెరి ఒక జతా తీసుకొని "అమ్మా నాన్నా లేని పుట్టింట్లో మమ్మల్ని ఎవరు పలుకరిస్తారు?" అంటూ ఆడపిల్లలు అన్నగారుకొని యిచ్చిన టికెట్టు తీసుకొని రైలు ఎక్కినారు.

మరుసటి సంవత్సరమునుండీ తమ్ములిద్దరూ తలిదండ్రుల తద్దినములు వారివారి యిళ్లలోనే పెట్టుకున్నారు.

అంతవరకూ రెండు రూపాయలైనా వెంకట్రావును అడుగనివారుగానీ సీతమ్మచేతి అన్నము తిననివారుగానీ బంధుజాలములో లేరు. తనకు ఋణము ఉన్నదని నలుగురిలో చెప్పటమువల్ల కాబోలు—అంత రాకపోకలుగల బంధుజాలము పల్చబడిపోయినది. మేనత్త కొడుకులూ మేనమామ బావమరదలూ తమకున్న బంధుత్వమును విస్మరించినారు.

అదిమొదలుగా అతడు తన జీవితములో సగము కుటుంబముక్రింద వ్యయపరచుకుంటూ సగము ఋణములక్రింద జమకట్టుతూ కాలమును నెట్టుకుంటూ వస్తున్నాడు.

వెంకట్రావు కొడుకులు చదువులకు ఎదిగినారు. పన్నెండుఏండ్లవాడు ఒకడూ—పదిఏండ్లవాడు ఒకడూను. ఇంటిలో ఉన్నంతసేపూ ఆ పిల్లలిద్దరికీ తృప్తిగానే ఉండేది—కాని వీథిముఖము చూడగానే 'మన కొ వస్తువ ఉంటే బాగుండును—మన కొ మాదిరి బట్టలుఉంటే బాగుండును' అని వాళ్ల మనసులు ఆరాటపడుతూ ఉండేవి. కాని సీతమ్మను కొడుకులు ఏది అడిగినా "బాబూ! నాన్నను వీటికోసము పీడించకండి. ఈ ఒక్క ఏడాది ఎట్లాగో గడిపితే మీ కిద్దరికీ మంచి మంచి బట్టలు కుట్టిస్తాము. సైకిలు కొని యిస్తాము" అంటూ ఎన్నో గగనకుసుమాలను ఏరి వాళ్లకు వాసన చూపించేది. 'ఆ ఏడాది ఎప్పుడు అవుతుందా' అని ఆ అమాయికమైన హృదయాలు రోజులను లెక్కించేవి. 'కష్టాలతో కూడిన ఈ సంవత్సరము ఎట్లాగో గడిపివేస్తే—వచ్చే సంవత్సరములో తాము కోరినవన్నీ అనుభవించవచ్చును—అమ్మ తాము అడిగినవన్నీ కొనియిస్తుంది.' అనుకుంటూ నిత్యమూ స్వప్నవీథులలో తిరుగాడుతూ ఒక్కొక్క సంవత్సరమే జరుపుకుంటూ వస్తున్నారు పిల్లలు.

గడచిన ఆరుసంవత్సరములనుండీ ఒక యింట్లో నే ఉండటమువల్ల వెంకట్రావుసంసారములో ప్రకాశరావు ఎరగని విషయము లేదు. సీతమ్మ చెప్పక పోయినా విషయమంతా గ్రహించాడు.

'నెలదినములనుండీ వెంకట్రావు మంచములో నే ఉన్నాడుకదా! సీతమ్మ పెట్టెలోనుండి రూపాయలను తీసి డాక్టర్లకొరకు ఖర్చుచేస్తున్నదంటే ఎక్కడినుండి వచ్చినట్లూ ఈ డబ్బు?'

ప్రకాశరావుకు ఆశ్చర్యమే కలిగినది.

*   *   *   *   *

వెంకట్రావుకు డాక్టరు యింట్లో నే ఆరు ఇంజక్షనులు యిచ్చాడు. శానిటోరియమ్‌లో స్థలము దొరికినదనీ వచ్చేవారములో చేర్పించమనీ చెప్పి చీటీవ్రాసి యిచ్చినాడు.

సీతమ్మ యింట్లో పడుతున్న యిబ్బందులను ప్రకాశరావు చూస్తూనేఉన్నాడు. కట్టెలఖర్చు తగ్గించటానికని రెండుదినముల కొకసారి రొట్టెలు చేయుటయూ - వాటిని మజ్జిగలో నానబెట్టి పిల్లలకు పెట్టుటయూ, చాకలివాడికి బట్టలు వెయ్యకుండా తానే సబ్బుతో ఉతికి పిల్లలకు వేయుటయూ గమనిస్తూనే ఉన్నాడు. తనకు రేషనుకార్డుమీద వచ్చిన బియ్యము వకీలుగారింటికి చీకటివేళ పంపుతూ - జొన్నలు గోధుమలతోనే గడుపుకుంటూ వస్తున్నది సీతమ్మ. తండ్రికి జబ్బుగా ఉన్నదని పిల్లలమనసు నొవ్వకుండా మరపిస్తున్నది. తాను మాసికలూ బ్రహ్మముడులూ వేసిన చీరలను కట్టుకుంటూ వెంకట్రావుకి కావలసిన ఖర్చులను పెట్టుతున్నది సీతమ్మ.

ఒకనాడు ప్రకాశరావు మధ్యాహ్నపువేళ వెంకట్రావుదగ్గర కూర్చుని మాట్లాడుతున్నాడు.

'మీరింత జబ్బుగా ఉన్నారుకదా! మీవాళ్లకెవరికీ తెలుపలేదా ఏమిటి - ఒక్కరైనా రాలేదు' అన్నాడు ప్రకాశరావు।

'వచ్చి చూడటానికి వాళ్లకు వీలుకావద్దూ' అని హీనస్వరముతో జవాబిచ్చినాడు వెంకట్రావు.

"ఏదో విధముగా వీలుచేసుకొనివచ్చి చూస్తారు. అబ్బాయిచేత వ్రాయించండి" అన్నాడు ప్రకాశరావు. ఆ తమ్ములనగా ఎవరు? వెంకట్రావు సగము కడుపుకు మాత్రమే తిని సంరక్షణచేసి చదువు చెప్పించిన తమ్ములేగా! అనుకున్నాడు ప్రకాశరావు.

"మీకు జబ్బుగా ఉన్నదాయెను. మనిషిసహాయమే కావలసి వస్తుందో - డబ్బు సహాయమే కావలసివస్తుందో... ఎందుకైనా మంచిది ఒకకార్డు వ్రాయించండి," అన్నాడు ప్రకాశరావు. అతడికి ఆ కుటుంబములోని లోతుపాతులు అప్పటివరకూ బాగా తెలియలేదు.

వెంకట్రావు ఒక వేడి నిట్టూర్పు విడచినాడు. దానిఅర్థము 'అంతటి భాగ్యమా?' అని స్ఫురించినది ప్రకాశరావుకు.

"పోనీ నేను వ్రాయనా?" అన్నాడు అంతటతో పోనీయకుండా. "వ్రాయండి ఒక కార్డుగా నష్టము" అన్నాడు వెంకట్రావు ముఖము అటు ప్రక్కకు త్రిప్పుకొని.

"నాకు చాలా ఆశ్చర్యముగా ఉన్నదండీ - ఆ యిల్లాలిసంగతి చూసినకొద్దీ నాకు కడుపు చెరువైపోతున్నది. ఇల్లు ఎట్లా గడుపుతున్నదో... ఏమిచేస్తున్నదో ... పిల్లల కేమి పెట్టుతున్నదో... తానేమి తింటున్నదో... ఒక్కమాట పైకి రానివ్వటము లేదు. నేను ఇంతదగ్గరగా ఉన్నానా... ఒక్క విషయమైనా నాకు తెలియటము లేదంటే నమ్మండి. నెలరోజులనుండీ మీరు మంచము మీదనే ఉన్నారా... మరొకరైనట్లయితే సంసారము ఈపాటికి నడివీధిలో ఉండేది." అని ప్రకాశరావు అంటూ ఉండగా వెంకట్రావు శుష్కవదనములో వేయి దీపాల వెలుగు వెలిగినట్లయినది.

*   *   *   *   *

రాత్రి పదిగంటలవేళ వెంకట్రావు పిలిచినట్లు తోచి, సీతమ్మ నిద్రలో ఉలికిపడి లేచింది.

"నాకు నిద్రపట్టటము లేదు. కడుపులో ఏదో ఆరాటముగా ఉన్నది సీతా!" అన్నాడు వెంకట్రావు పక్కమీద మసలుతూ.

"కొంచెము పండ్లరసము తాగి పడుకోండి" అని గ్లాసులో పోసి చేతి కిచ్చింది సీతమ్మ.

"సీతా! ఈ పక్క అమృతాంజనముతో రాయి" అన్నాడు. సీతమ్మ అమృతాంజనముతో వెంకట్రావువీపుమీద రాస్తూ ఉండగా, 'డాక్టర్లకు

ఫీజు ఎక్కడినుంచి ఇస్తున్నావు సీతా! ఇంజక్షను రూపాయలు ఎప్పటికప్పుడు చేతిలో వేసుకుంటున్నాడట కదూ డాక్టరు?" అన్నాడు వెంకట్రావు.

"........."

"పండ్లకూ మందులకూ ఎంత లేదన్నా రోజుకు పదిరూపాయలు ఖర్చవుతున్నది కదూ?"

సీతమ్మ ఆ మాటలు వినకుండా అమృతాంజనముతో రాస్తూ కూర్చున్నది.

వెంకట్రావు కేదో తటాలున మనసుకు తట్టి— "నీ చేతిగాజు లేవే సీతా!" అని ఆమెముఖము చూస్తూ అడిగినాడు.

".........."

"నేను అప్పుడే రెండు జతల గాజులు ఖర్చుపెట్టించానా? ఇంకా శానిటోరియమ్‌లో చేర్పిస్తానంటున్నావు. అక్కడ బాగా ఖర్చవుతుంది. ఇంట్లో ఉంటే కొద్దిలో వెళ్లపోతుంది గా సీతా!"

"శానిటోరియమ్‌లో చేర్పిస్తే మీ ఆరోగ్యము త్వరగా బాగవుతుందట. ఆరోగ్యము బాగయ్యేటప్పుడు డబ్బు ఖర్చయితే మాత్రము ఏమి?" అన్నది సీతమ్మ తల వంచుకొని.

"డబ్బు కావద్దు టే? అప్పుడే ఇంత ఖర్చయినదా? ఇంకా ఎంత కావలసిఉన్నదో? ఎక్కడినుంచి వస్తుంది డబ్బు?"

"ఎడమ చెతికి ఇంకా రెండుగాజు లున్నాయిగా!"

"సీతా! అవికూడా నాక్రిందే ఖర్చుపెట్టుతావా? తరువాత నీకెట్లాగే?"

"మీ ఆరోగ్యము కుదురుకుంటుంది కదండీ. మరి వాటి ఉపయోగము అవసరాలకి ఖర్చుపెట్టటానికేగా!" సీతమ్మ కళ్లనుండి వెచ్చటి కన్నీటిబొట్లు వెంకట్రావు చేతిమీద పడ్డవి.

"సీతా! ఏడుస్తున్నావా?... ఆ రెండు గాజులూ ఇప్పుడే ఖర్చుపెట్టకు. తరువాత ఇబ్బంది పడతావు. ఆ పదిరోజులలో రకరకాల ఖర్చులు వస్తాయి." అన్నాడు వెంకట్రావు ఆమె కన్నీళ్లను తుడుస్తూ.

*  *  *  *  *

ఆదినము వెంకట్రావును శానిటోరియములో చేర్పించవలెనని ప్రకాశరావు టాక్సీకారును తీసుకొనివచ్చి వాకిటిముందు నిలబెట్టి లోపలికి వెళ్లి సామాను సర్దుతున్నాడు. వెంకట్రావుకు కావలసిన పరుపుచుట్టా పండ్లబుట్టా కట్టుతూ "సీతమ్మా ఆయనకు ఇస్త్రీబట్టలు తొడిగించు. ఇంక బయలుదేరుదాము—" అన్నాడు.

"అన్నగారూ! మీరు ఇట్లా వచ్చి వీరిదగ్గర ఒక్కక్షణము కూర్చోండి. నేను ఒకసారి అట్లా వకీలుగారింటి కెళ్లి ఆయన భార్యతో చెప్పివస్తాను. ఇంతలోకే వారికి—ఓవల్‌టిన్ తాగిన ఆయాసము కూడా తగ్గుతుంది" అంటూ అవతలికి వెళ్లింది సీతమ్మ.

ఆమె అట్లా గడప దాటిందో లేదో...వెంకట్రావు 'అమ్మా' అని ఒక్క కేక వేసి వాంతి చేసుకొన్నాడు.

అతనిని దిండుకాన్చి కూర్చుండబెట్టి, గుండెమీద రాస్తూ కూర్చున్నాడు ప్రకాశరావు మంచంమీద. అట్లా ఉండగానే వెంకట్రావు మరొక పెద్ద కేక పెట్టాడు.

అంతలో సీతమ్మ తిరిగి వచ్చింది. ఆమె మెడలోని మంగళసూత్రములు నూలుదారములోనికి ఎక్కటానికే ఈ ఆలస్యము జరిగినదని ప్రకాశరావు ఆమెనుచూసినవెంటనే గ్రహించినాడు. ఆమె అలికిడివిని వెంకట్రావు కళ్లు తెరచి దగ్గరకు రమ్మని సీతమ్మకు చేతిసైగ చేశాడు.

సీగమ్మ అతడి తలక్రింది దిండ్లను సర్ది, మంచముమీద కూర్చుని "మళ్లీ వాంతి అయిందా ఏమిటి? ఆయాసపడుతున్నా రెందుకు? అంటూ అతడి గుండెమీద చెయ్యి వేసి రాయ నారంభించినది.

"సీతా! ఇటు చూడు. నామాట విను...... డబ్బంతా లాభములేనిదానికి ఖర్చుచేయకు. ఆపైన ఇబ్బందిపడిపోతావు. ఉన్నది కాస్తా ఇప్పుడే ఖర్చుచేయకు." అంటూ క్షీణించిన ధ్వనితో ఒక్కొక్కమాటే ఉచ్చరిస్తున్నాడు వెంకట్రావు.

"డబ్బుసంగతి మీ కెందుకు చెప్పండి. మీరు మందు తీసుకుంటూ, శానిటోరియమ్‌లో ఉంటే తొందరగా జబ్బు తగ్గిపోతుందని డాక్టరు అన్నాడు. జబ్బు తగ్గిపోయినతరువాత మనము మళ్ళీ చేయిం

చుకోకూడదూ ? వాటికోసము యింత జబ్బులో ఉన్న మీరు దిగులుపడుతున్నారా ? అన్నగారూ! మీరైనా ఒకతూరి చెప్పండి వీరికి. అస్తమానమూ డబ్బునుగురించి ఆలోచించటము ఎక్కువైపోయింది. అసలు ఇంత జబ్బు చేయటానికి కూడా అదే కారణ మేమో !" అంటూ కళ్లు ఒత్తుకొని వెంకట్రావు ఎద పైన రాస్తూ అతడి ముఖములోకి చూసింది సీతమ్మ.

వెంకట్రావు మరొక పెద్ద కేక పెట్టినాడు.

సీతమ్మ మంచముమీద కూర్చుని వెంకట్రావును పట్టుకొన్నది. ఆయాసపడుతున్న వెంకట్రావుఫాల భాగము ఆమె కన్నీటితో తడిసిపోయినది.

ఈలోపల ప్రకాశరావు కారులో సామాను లన్నీ సర్ది—వెంకట్రావుకు పక్కను అమర్చి—షర్టు చేతులను పైకి తోసుకుంటూ గదిలోకి వచ్చి వెంక ట్రావును లేవతీయబోయి "సీతమ్మా నీవు మంచము మీదినుంచి లేచి ఇవతలికి రా" అంటూ వెంకట్రావు ఒంటినిండా బట్ట కప్పినాడు.

"అన్నగారూ ఎండఎక్కిపోతున్నది. మనము త్వరగా బయలుదేరవద్దూ" అంటూ సీతమ్మ పెరటి తలుపులను మూసివచ్చినది.

ప్రకాశరావు నీరవుడై "ఇంకా అక్కడికి ఎందుకు తల్లీ !" అంటూ గోడకు చేరబడిపోయినాడు.

సీతమ్మ నిలువునా నేలమీద పడిపోయినది.

వెంకట్రావు చాలా జబ్బుగా ఉన్నాడని సీతమ్మకూ వెంకట్రావుకూ తెలియకుండా ప్రకాశరావు సీతమ్మ మరదులకూ బంధువులకూ అనేక ఉత్తరాలు వ్రాసినాడు. 'ఎట్లా ఉన్నద'ని ఒక్కరిదగ్గర నుండైనా ఉత్తరముముక్క రాలేదు. కాని వెంక ట్రావు చనిపోయినాడన్న వార్త తెలియగానే బంధు జనము వచ్చి వాలినది.

తన నగలను అమ్మినబాబతు పైకముతో సీతమ్మ తన కొడుకుచేత కర్మలను చేయించినది.

'మరొక యేభయిరూపాయలు ఖర్చుఅయినా మంచిగోవును దానము యిస్తే పుణ్యమూ పురుషార్థ మూనూ'అంటూ దగ్గర ఉండి కర్మకాండ చేయించి మరీ యిళ్లకు వెళ్లినారు బంధుజనము.

సీతమ్మకు వెంకట్రావు తుదిమాటలలోని అర్థము అప్పుడు గ్రాహ్యమైనది !